
విజేత
Fresh Healthy Living
SINCE 7th MARCH 1999
CELEBRATING 25 YEARS OF VIJETHA
విజయవంతమైన 25వ వార్షికోత్సవం
• 1999 లో స్థాపించబడిన విజేత సూపర్ మార్కెట్స్ నాణ్యతకు, విలువకు, సౌలభ్యానికి చిహ్నంగా ఉంటూ ఎన్నో గృహాలలో అంతర్భావంగా మారింది.
• మా అభివృద్ధికి కారణమైన మా కస్టమర్‌లకు వారు చూపించిన అపార నమ్మకానికి మా హృదయపూర్వక కృతజ్ఞతలు
• రాబోయే విజయ ప్రయాణం లో మీరంతా భాగస్వామ్యులుగా ఉంటారని కోరుకుంటూ...
- మురకొండ జగన్మోహన్ రావు
మేనేజింగ్ డైరెక్టర్ -
విజేత సూపర్ మార్కెట్స్ ప్రైవేట్ లిమిటెడ్
CELEBRATING 25 YEARS OF VIJETHA
జూబిలీ జాక్ పాట్
లక్కీ డ్రా
23rd Feb - 31st Mar 2024
లక్కీ విజేతలు
మొదటి బహుమానం
1 లక్కీ విజేత
1 Tata Nexon
రెండవ బహుమానం
5 లక్కీ విజేతలు
Royal Enfield Classic 350
మూడవ బహుమానం
25 లక్కీ విజేతలు
25 Chetak Urbane EV Scooters
బోనస్ బహుమానం
111 లక్కీ విజేతలు
Panasonic Electric 1KG Rice Cookers
COCONUT BIG — PER PC Vijetha Price ₹26
KIRAN MELON — PER KG Vijetha Price ₹18
BANANA FRUIT — PER KG Vijetha Price ₹35
KHARBUJ (MUSK MELON) — PER KG Vijetha Price ₹39
SWEET POTATO — PER KG Vijetha Price ₹29
ORIGINAL KIMIA DATES / ELEPHANT DATES 400G BOX — MRP ₹ 310/320 Vijetha Offer BUY 1 GET 1 FREE
GRAPES GREEN SEEDLESS PUNET — PER PUNET Vijetha Price ₹35
ORANGE NAGPUR — PER KG Vijetha Price ₹49
GRAPES BLACK SEEDLESS PUNET — PER PUNET Vijetha Price ₹54
ORANGE IMPORTED 4PC PACK — PER PACK Vijetha Price ₹99
APPLE RED DELICIOUS 4PC PACK — PER PACK Vijetha Price ₹139
APPLE ROYAL GALA 4PC PACK — PER PACK Vijetha Price ₹149
OFFERS VALID FROM 7th TO 10th MARCH 2024 ONLY.
*T&C Apply.
SINCE 1999 In Customer Service
విజేత సూపర్‌మార్కెట్స్ ప్రైవేట్ లిమిటెడ్
హైదరాబాద్ • విశాఖపట్నం • గుంటూరు • విజయవాడ • కాకినాడ • రాజమహేంద్రవరం
అడ్రస్: HO. 5-4/6, బాలాజి టవర్స్, చందానగర్, హైదరాబాద్ - 500 050

నకిలీ సర్టిఫికెట్లు.. సీనియర్ అసిస్టెంట్‌పై వేటు..?

● ఫలక్‌నుమాలో మూడో రోజూ రికార్డుల పరిశీలన



మేయర్‌కు వినతిపత్రం ఇస్తున్న నరసింహారెడ్డి, శ్రవణ్

హైదరాబాద్ సిటీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నకిలీ జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీపై ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమించారు. ఫలక్‌నుమా సర్కిల్ పరిధిలో నాన్ అవైలబిలిటీ పత్రాలు లేకుండా సర్టిఫికెట్లు జారీ చేసినట్టు గుర్తించడంతో అక్కడి సీనియర్ అసిస్టెంట్ సత్యనారాయణపై వేటు పడినట్టు తెలిసింది. కమిషనర్ రోనాల్డ్‌రోస్ ఆదేశాల మేరకు జోనల్ అధికారులు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారని సమాచారం. నకిలీ సర్టిఫికెట్ల జారీపై ఫిర్యాదుల నేపథ్యంలో మూడు రోజులుగా కేంద్ర కార్యాలయంలోని అధికారులు.. ఫలక్‌నుమా సర్కిల్ ఆఫీస్‌లో రికార్డులను పరిశీలిస్తున్నారు. జారీ చేసిన సర్టిఫికెట్ల ఆధారంగా ఆస్పత్రుల్లోనూ వివరాలు సేకరిస్తున్నారు. ఈ క్రమంలో ఫేక్ సర్టిఫికెట్లు జారీ అయినట్టు కమిషనర్‌కు నివేదిక సమర్పించారు. దీంతో సదరు అధికారిని సస్పెండ్ చేయాలని రోనాల్డ్ రోస్ ఆదేశించారని ఓ అధికారి తెలిపారు.

ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోవాలి : బీజేపీ

జీహెచ్ఎంసీలో నకిలీ పత్రాల జారీ నిత్యకృత్యంగా మారిందని, గతంలోనూ 23 వేలకుపైగా సర్టిఫికెట్లు ఇచ్చారని, ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోకుండా కిందిస్థాయి సిబ్బందిని బలి చేయడం వల్లే అక్రమాలు ఆగడం లేదని బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నరసింహారెడ్డి, కార్పొరేటర్లు శ్రవణ్‌కుమార్, సురేఖ అన్నారు. పై అధికారుల సహకారం లేకుండా నకిలీ సర్టిఫికెట్ల జారీ సాధ్యం కాదని, ఈ తతంగంపైన సమగ్ర విచారణ జరిపి అసలైన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బుధవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ రోనాల్డ్‌రోస్‌లకు వినతిపత్రం అందజేశారు.

పోలీసుల ఎదుట హాజరైన సినీనటి సౌమ్యజాను



సౌమ్యజాను

బంజారాహిల్స్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): హోంగార్డుపై దాడి చేయడంతోపాటు అసభ్యపదజాలంతో దూషించిన సినీనటి సౌమ్యజాను అలియాస్ షేక్ జాన్‌బీ బుధవారం బంజారాహిల్స్ పోలీసుల ఎదుట హాజరయ్యారు. ఫిబ్రవరి 24న బంజారాహిల్స్ రోడ్డు నెంబరు.12లో సౌమ్యజాను జాగ్వార్ కారును రాంగ్‌రూట్‌లో నడుపుతూ వెళ్లారు. గమనించిన హోంగార్డు గొడుగు విఘ్నేష్ అడ్డుకోగా కారు నుంచి దిగిన నటి అతడిని కొట్టడంతోపాటు సెల్‌ఫోన్ లాక్కొని నేలకు కొట్టింది. దుర్భాషలాడుతూ హోంగార్డు వేసుకున్న కోట్‌ను చించేసింది. దీంతో విఘ్నేష్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు 332, 353, 427, 504, 279 ఐపీసీతో పాటు మోటార్ వెహికల్ చట్టాల కింద కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న నటి సౌమ్య హైకోర్టును ఆశ్రయించారు. తనపై పెట్టిన కేసులన్నీ ఏడు సంవత్సరాల్లోపు శిక్ష పడేవే అని, 41 సీఆర్‌పీసీ కింద నోటీసు ఇచ్చి విచారణ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోర్టును ఆమె కోరారు. ఈ మేరకు 41 సీఆర్‌పీసీ ఇచ్చి విచారణ చేయాలని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. ఈ నెల 11లోపు విచారణాధికారి ఎదుట హాజరుకావాలని సౌమ్యకు సూచించింది. ఈ నేపథ్యంలో బుధవారం సౌమ్య తన తల్లితోపాటు ఇద్దరు న్యాయవాదులతో కలిసి బంజారాహిల్స్ పోలీసు స్టేషన్‌కు వచ్చారు. విచారణాధికారి పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. నోటీసు ఇచ్చి పంపించేశారు.

ఘనంగా మహిళా దినోత్సవం



మహిళను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మణ్ నాయక్

ఖైరతాబాద్, మార్చి 6(ఆంధ్రజ్యోతి):మహిళలు స్వశక్తితో ఎదిగే విధంగా ఆలోచించాలని పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఏసీపీ కె.రాజ్యలక్ష్మి సూచించారు. బుధవారం సైఫాబాద్ పీజీ సైన్స్ కళాశాలలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రిన్సిపాల్ లక్ష్మణ్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినులకు, మహిళా సిబ్బందికి డెంటల్ క్యాంప్‌తో పాటు మహిళా సమస్యలపై ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ అపూర్వదేవి ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు మహిళా ప్రముఖులను, కళాశాల మహిళా ఫ్యాకల్టీ సభ్యులను సత్కరించారు. వైద్యులు డాక్టర్ ప్రవీణ, డాక్టర్ నవనీత వైస్ ప్రిన్సిపల్, తదితరులు పాల్గొన్నారు.



మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం బంజారాహిల్స్‌లోని సీఎంటీసీ భవన్‌లో నిర్వహించిన వేడుకలో నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి హాజరై కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి, డీసీ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.
- బంజారాహిల్స్, మార్చి 6(ఆంధ్రజ్యోత)

పర్యాటక సంస్థలో..

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బషీర్‌బాగ్ పర్యాటక సంస్థ రిజర్వేషన్ కేంద్ర కార్యాలయంలో బుధవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పర్యాటక సంస్థ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సమావేశంలో ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీఎస్.బోస్, ప్రధాన కార్యదర్శి సబ్బురాజమౌళి, మహిళా ఉద్యోగుల సంఘం కార్యదర్శి జ్యోతి, ప్రతినిధులు హైమ, రాజలక్ష్మి, రచన, ఆదిలక్ష్మి, సుకన్య, వర్ష, మోజుద్దీన్, శరత్, లావణ్య, రజిని పాల్గొన్నారు. టూరిజం ప్లాజాలో జరిగిన వేడుకల్లో శాంతి, మధుర, మనోజ్ఞ పాల్గొన్నారు.



పురస్కారగ్రహీతలతో మధుసూదనాచారి

చట్టసభల్లో మహిళల ప్రాధాన్యం పెరగాలి

చిక్కడపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో మహిళా ప్రాధాన్యం పెరగాలని శాసనసభ తొలి స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా భిన్న రంగాలకు చెందిన ప్రముఖ మహిళలు కె.లలిత, ఎస్.శ్రీమణి, టి.శోభారాణిలను సత్కరించారు. ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో తమ ప్రతిభ కనబరుస్తున్నారన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు భమిడి ఉష, పాల్గొన్నారు.

'ఓం నమో నమఃశివాయ' పాట ఆవిష్కరణ



పాటను ఆవిష్కరిస్తున్న ప్రముఖ గేయ రచయిత చంద్రబోస్

పంజాగుట్ట, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకొని జగిత్యాల జిల్లా రాజారం గ్రామానికి చెందిన యువ రచయిత్రి గాయత్రి దేవరకొండ రచించిన ఓం నమో నమఃశివాయ పాటను ప్రముఖ గేయ రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ బుధవారం సోమాజిగూడలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ఉల్లాసానికి సంగీతం ఎంతో దోహదం చేస్తుందన్నారు. ఈ పాటకు కార్తీక్ అద్భుతమైన సంగీతం సమకూర్చారన్నారు.

'ప్రభుత్వ ఆదేశాల మేరకే ముదిరాజ్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఏర్పాటు'

పంజాగుట్ట, మార్చి 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ముదిరాజ్ ఆత్మగౌరవ భవన నిర్మాణం కోసం గత ప్రభుత్వం కోకాపేటలో 5 ఎకరాల భూమి, రూ. 5కోట్లు కేటాయించిందని, గత ప్రభుత్వ ఆదేశాల మేరకే ముదిరాజ్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఏర్పాటు చేయడం జరిగిందని ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ ఎస్. రాములు తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసి న సమావేశంలో ట్రస్ట్ కోశాధికారి బి.సత్తయ్య, తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షుడు యాదగిరి, కార్యనిర్వాహక కార్యదర్శి దమ్మిగారి కనకయ్యతో కలిసి ఆయన మాట్లాడారు. భవన నిర్మాణానికి ట్రస్ట్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు అందుబాటులో ఉన్న వారితో ట్రస్ట్ ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వ నిధుల నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకోలేదన్నారు. ఇప్పటి వరకు ట్రస్ట్, ముదిరాజ్ మహాసభలు ఒక్క రూపాయి కూడా విరాళం సేకరించలేదన్నారు. వాస్తవాలు తెలియక కొందరు ట్రస్టు, ముదిరాజ్ మహాసభపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. సమావేశంలో మహాసభ నాయకులు యాదగిరి, వరలక్ష్మి, ఉషా ముదిరాజ్, బి.వెంకట్ ముదిరాజ్, స్వామి, మల్లేష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా రంగానికి ఉజ్వల భవిష్యత్

● ఫార్మాస్యూటికల్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఈడీ రాజాభాను

బంజారాహిల్స్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఫార్మా రంగానికి ఉజ్వల భవిష్యత్ ఉందని, విద్యార్థులు రోజురోజుకూ సరికొత్త సాంకేతికతను అందుపుచ్చుకోవాలని ఫార్మాస్యూటికల్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఈడీ రాజాభాను అన్నారు. బుధవారం బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉల్ ఉలూం ఫార్మసీ కాలేజీలో నేషనల్ ఫార్మసీ ఎడ్యుకేషన్ డేలో భాగంగా ఫార్మా అన్వేషణ్-2024 సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 1937లో మహదేవ్ రావ్ లాల్ ష్రాఫ్ బీఫార్మసీ కోర్సును ప్రారంభించారని, అందువల్ల ఆయన పుట్టిన రోజైన మార్చి 6ను నేషనల్ ఫార్మసీ ఎడ్యుకేషన్ డేగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఈసీ మెంబర్ ఎం.వెంకటరమణ మాట్లాడుతూ... నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీని ఫార్మసీ విద్యలో ప్రవేశ పెట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.సుమాలిని, ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ వి.ప్రభాకర్‌రెడ్డి, సుల్తాన్ ఉలూం ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ అనుపమ కోనేరు తదితరులు పాల్గొన్నారు.

'రాజకీయాల్లో పురుషాధిపత్యం ఎక్కువే'

పంజాగుట్ట, మార్చి 6(ఆంధ్రజ్యోతి): తండ్రి వారసత్వం ఆడపిల్లలకు ఎలా వస్తుందని తక్కువ చేసి మాట్లాడుతున్నారని,అన్ని రంగాల్లో వారసత్వం వచ్చినప్పుడు రాజకీయాల్లో ఎందుకు రాదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి ప్రశ్నించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ యశోద అధ్యక్షతన బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఉమెన్ టుడే పబ్లికేషన్స్ నిర్వహణలో లలితం ఆర్ట్స్ పెయింటింగ్ ఎగ్జిబిషన్, కనుమూరి అపర్ణ హ్యాండ్ ఎంబ్రాయిడరీ చేసిన రామాయణం ప్రదర్శనను డాక్టర్ వెన్నెల గద్దర్, మహిళా కమిషన్ మాజీ కార్యదర్శి సరళా రాజ్యలక్ష్మి, డాక్టర్ హరిణితో కలిసి ఆమె ప్రారంభించారు. తమ తండ్రుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లడనికే రాజకీయాల్లోకి వచ్చామని విజయా రెడ్డి, వెన్నెల గద్దర్ అన్నారు. భర్త మృతి చెందినా, పట్టుదలతో ఆటో నేర్చుకొని, ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్న రాణిగంజ్‌కు చెందిన అరుణను, వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన పలువురు మహిళలను వారు సన్మానించారు.

మూడవ స్టాండింగ్ కమిటీ.. తొలి సమావేశం..!

● 14 అంశాలకు ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ విజయలక్ష్మి

హైదరాబాద్ సిటీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఎన్నికైన జీహెచ్ఎంసీ మూడవ స్టాండింగ్ కమిటీ తొలి సమావేశం బుధవారం జరిగింది. నూతన సభ్యులకు స్వాగతం పలికిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి వారిని అధికారులకు పరిచయం చేశారు. అనంతరం ఎజెండాపై చర్చించిన సభ్యులు 14 అంశాలను ఆమోదించారు. స్టాండింగ్ కమిటీ తదుపరి సమావేశం బుధవారం, పార్లమెంట్ ఎన్నికల అనంతరం ప్రతీ గురువారం నిర్వహించాలని నిర్ణయించారు. మొదటి సమావేశంలోనే పారిశుధ్య, ప్రకటనల విభాగాలపై అడ్‌హక్ కమిటీల ప్రతిపాదనకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. సమావేశంలో కమిషనర్ రోనాల్డ్‌రోస్, తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ఆమోదించిన ప్రధానాంశాలు..

- గ్రేటర్‌లోని భవనాలు, రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి పైపులైన్ల వ్యవస్థ, నాలాలు తదితర యుటిలిటీస్‌ను జీఐఎస్ మ్యాపింగ్ చేయాలి. తద్వారా కచ్చితమైన సమాచారం ఉండడంతోపాటు.. ఎన్ని భవనాల నుంచి ఆస్తిపన్ను వసూలవుతుంది..? పన్ను పరిధిలోకి రాని నిర్మాణాలెన్ని..? ఏ కేటగిరిలో పన్ను చెల్లిస్తున్నారు..? దేని కోసం వినియోగిస్తున్నారు..? అన్న వివరాలు తెలియనున్నాయి.
- కూకట్‌పల్లిలోని ఎల్లమ్మచెరువు నుంచి రూ.2.74 కోట్లతో గతంలో ప్రతిపాదించిన 1200ఎంఎం డయా పైపులైన్‌కు బదులు అదే వ్యయంతో 1600 ఎంఎం డయా పైపులైన్ నిర్మాణం చేయాలని నిర్ణయించారు.
- శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి మండలాల పరిధిలోని పలు చెరువుల వద్ద సీఎస్ఆర్ కింద అభివృద్ధి పనులు చేసే గడువును పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నారు.
- ఎల్‌బీనగర్‌లోని బైరామల్‌గూడ చెరువు నుంచి సరూర్‌నగర్ చెరువు వరకు రూ.5.88 కోట్లతో ప్రతిపాదించిన వరదనీటికాల్వ నిర్మాణానికి రూ.10 లక్షలు అదనంగా మంజూరు చేయాలి.

పారిశుధ్యం, ప్రకటనల విభాగంపై..

అడ్‌హక్ కమిటీల ఏర్పాటు

- కౌన్సిల్ తీర్మానం నేపథ్యంలో ప్రతిపాదన
- ఆమోదించిన స్టాండింగ్ కమిటీ
- ఒక్కో పార్టీ నుంచి ఇద్దరు కార్పొరేటర్లు
- చైర్‌పర్సన్‌గా మేయర్
- సమగ్ర పరిశీలన అనంతరం నివేదిక

హైదరాబాద్ సిటీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీలోని పారిశుధ్య నిర్వహణ, ప్రకటనల విభాగంలో అవినీతిపై ఎట్టకేలకు కమిటీలు ఏర్పాటయ్యాయి. అన్ని పార్టీల సభ్యులతో కూడిన అడ్‌హక్ కమిటీలను బుధవారం స్టాండింగ్ కమిటీ ఆమోదించింది. మేయర్ చైర్‌పర్సన్‌గా ఉన్న రెండు కమిటీల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎంల నుంచి ఇద్దరు చొప్పున కార్పొరేటర్లు సభ్యులుగా ఉన్నారు. జీఓ.68 పేరిట 15 అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో ప్రకటన బోర్డులు, హోర్డింగ్‌లపై నిషేధం, బస్‌షెల్టర్లు, ఇతర ప్రాంతాల్లో ప్రకటన బోర్డులను యాడ్ ఏజెన్సీలకు కేటాయించడంలో అక్రమాలు జరిగాయంటూ గత నెల 19, 20 తేదీల్లో జరిగిన కౌన్సిల్ సమావేశాల్లో పాలకమండలి సభ్యులు మండిపడ్డారు. యేటా జీహెచ్ఎంసీకి రూ.100 కోట్ల ఆదాయం రావాల్సి ఉండగా.. అధికారులు, యాడ్ ఏజెన్సీలు కుమ్మక్కై అక్రమాలకు పాల్పడుతుండడంతో సంస్థకు నష్టం జరుగుతున్నదని ఆరోపించారు. పారిశుధ్య నిర్వహణలోనూ అవినీతి జరుగుతోందని మండిపడ్డారు. స్వీపింగ్, ఇంటింటి చెత్త సేకరణ, రహదారులపై చెత్త తొలగింపు, స్వీపింగ్ యంత్రాల పనితీరు సరిగా లేదన్నారు. యేటా రూ.400 కోట్ల వరకు ఖర్చు చేస్తోన్నా.. నగరంలో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతున్నదని, ఈ పరిస్థితి మారాలంటే సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. ఈ క్రమంలో రెండు విభాగాలపై కమిటీలు వేయాలని కౌన్సిల్ సమావేశంలో తీర్మానించారు. ఇందులో భాగంగానే అడ్‌హక్ కమిటీల ఏర్పాటును కమిషనర్ ప్రతిపాదించగా స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. కమిటీకి సమాచారమిచ్చేందుకు ఆయా విభాగాల అదనపు కమిషనర్లు కోఆర్డినేటర్లు/కన్వీనర్లను నియమించాలని కమిషనర్ సూచించారు. సమగ్ర పరిశీలన అనంతరం కమిటీలు ఇచ్చే నివేదికల ఆధారంగా తదుపరి చర్యలుంటాయి.

పారిశుధ్య విభాగం కమిటీ

చైర్‌పర్సన్ - గద్వాల్ విజయలక్ష్మి, మేయర్
బీఆర్ఎస్ - రావుల శేషగిరిరావు, సామల హేమ
కాంగ్రెస్ - ఎం.రజిత, వి.జగదీశ్వర్‌గౌడ్
బీజేపీ- డాక్టర్ బి.సురేఖ, పూరపల్లి శ్రవణ్
ఎంఐఎం- సయ్యద్ సోహైల్ ఖాద్రీ, డాక్టర్ ఆయేషా హుమేరా

ప్రకటనల విభాగం కమిటీ

చైర్‌పర్సన్ - గద్వాల్ విజయలక్ష్మి, మేయర్
బీఆర్ఎస్ - వి.సింధూఆదర్శ్‌రెడ్డి, మెట్టు కుమార్‌యాదవ్
కాంగ్రెస్- దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, పి.విజయారెడ్డి
బీజేపీ - వంగా మధుసూదన్‌రెడ్డి, కొప్పుల నరసింహారెడ్డి
ఎంఐఎం-సయ్యద్ మినాజుద్దీన్, బతాజబీన్

బీఆర్ఎస్ నిరసన

(5వ పేజీ తరువాయి)

ఇస్తామని చెప్పారని గుర్తుచేశారు. పేద కుటుంబాలను ఇబ్బందులు పెట్టవద్దనే తమ ప్రభుత్వం పేదళ్ల కాలంలో ఎల్ఆర్ఎస్ జోలికి వెళ్లలేదని తెలిపారు. అధికారం చేపట్టగానే ఇచ్చిన హామీని మరిచి పేదలపై కాంగ్రెస్ ఆర్థిక భారం మోపేందుకు కుట్రలు చేస్తోందన్నారు అనంతరం సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి తలసాని సాయి కిరణ్ యాదవ్ ఐదుగురు సభ్యులతో కలిసి హెచ్ఎండీఏ కార్యాలయంలోకి వెళ్లి అధికారులకు చల్లని వాటర్‌బాటిళ్లను అందజేసి ఎల్ఆర్ఎస్‌ను వెంటనే రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరీ, మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, డివిజన్ కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ తీరుపై నిరసన

కుత్బుల్లాపూర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ పేరుతో డబ్బు వసూలు చేసి నిరుపేదలను దోచుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనా? అని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ విమర్శించారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణులు బుధవారం ఎల్ఆర్ఎస్‌పై నిరసన తెలిపారు. కాంగ్రెస్ అంటే కష్టాలు.. కష్టాలు అంటేనే కాంగ్రెస్ అనేలా పాలన సాగుతోందన్నారు. 100 రోజుల పాలన పూర్తి కావడానికి ఇంకా వారం రోజులు మిగిలి ఉందని, ఇప్పటివరకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది శూన్యమని ఆరోపించారు. అనంతరం భూ క్రమబద్ధీకరణను ఎటువంటి రుసుం లేకుండా ఉచితంగా చేపట్టాలని కోరుతూ కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ వినర్సింహకు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్లు, డిప్యూటీ మేయర్, వైస్ చైర్మన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అక్బరుద్దీన్‌తో కలిసి టీ తాగుతావా?

● మంత్రి పొన్నంపై గ్రేటర్ నేతల గరం

హైదరాబాద్ సిటీ, మార్చి6 (ఆంధ్రజ్యోతి): ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్‌తో కలిసి టీ తాగుతావా.? అంటూ రాష్ట్ర రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్‌పై గ్రేటర్ కాంగ్రెస్ నేతలు గరం గరమయ్యారు. ఫిరోజ్ ఖాన్, అజారుద్దీన్ ఆయనతో వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. గ్రేటర్ కాంగ్రెస్ నేతల సమావేశం డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి అధ్యక్షతన గాంధీభవన్‌లో బుధవారం జరిగింది. ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్‌తో కలిసి మంత్రి పొన్నం హాజరయ్యారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో గెలుపుదిశగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై నేతలు, కార్యకర్తలతో చర్చించారు. గురువారం నుంచి మూడు రోజులపాటు నగరంలో సీఎం రేవంత్‌రెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేస్తుండడంతో ఆయా అంశాలను వివరించారు. సమావేశం అనంతరం రెండు రోజుల క్రితం ఉప్పుగూడలో అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభోత్సవం సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీతో కలిసి పొన్నం టీ తాగిన అంశం ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. ప్రారంభోత్సవం రోజున అక్కడ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై సీఎం ఫొటో లేకపోవడంపై కాంగ్రెస్ నేతలు అప్పటికే గుర్రుగా ఉన్నారు. ఈక్రమంలో అక్బరుద్దీన్‌తో కలిసి టీ తాగడాన్ని తప్పుబడుతూ గాంధీభవన్‌లో బుధవారం జరిగిన సమావేశంలో మంత్రి పొన్నంపై ఫిరోజ్‌ఖాన్, అజారుద్దీన్ ఆక్షేపణ వ్యక్తం చేసినట్లు తెలిసింది. వివాదం పెద్దదవుతున్న క్రమంలో సీనియర్లు కలగజేసుకుని సర్దిచెప్పారు. సమావేశంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్ యాదవ్, ప్రధాన కార్యదర్శి కోట నీలిమ, కార్పొరేటర్ విజయారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విమెన్ ఇన్ స్టెమ్ స్కాలర్‌షిప్‌లు

● ప్రారంభించిన బ్రిటిష్ కౌన్సిల్

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): యూకేలో సైన్స్, సంబంధిత కోర్సులు చేయాలనుకునే మహిళల కోసం ప్రత్యేకంగా స్కాలర్‌షిప్‌లను తీసుకువచ్చింది బ్రిటిష్ కౌన్సిల్. యూకేలోని క్వీన్ మేరీ విశ్వవిద్యాలయం, ఆంగ్లియా రస్కిన్, గ్రీన్‌విచ్, సౌతాంప్టన్‌తో పాటుగా కోవెంట్రీ విశ్వవిద్యాలయాల భాగస్వామ్యంతో 25 స్కాలర్‌షిప్‌లను ఇండియా, దక్షిణాసియాలోని మహిళల కోసం రిజర్వ్ చేశామని బ్రిటిష్ కౌన్సిల్ ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ స్కాలర్స్ డాటా సైన్స్, కంప్యూటర్ సైన్స్, ఫార్మాస్యూటికల్ సైన్స్, ఎలక్ట్రానిక్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్, సివిల్ ఇంజినీరింగ్ వంటి కోర్సులను చేయవచ్చు. బ్రిటిష్ కౌన్సిల్ ఎడ్యుకేషన్ ఇండియా డైరెక్టర్ రితికా చందా పరుక్ ఎంబీఈ మాట్లాడుతూ ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లను సైన్స్ ద్వారా మాత్రమే పరిష్కరించవచ్చన్నారు. ఆయా యూనివర్శిటీలలో నిర్దిష్ట గడువు సహా ఇతర సమాచారం కోసం https://www.britishcouncil.in/study-uk/scholarships/womeninstem-scholarships చూడవచ్చు.

పేట్‌బషీరాబాద్ స్థలాన్ని అప్పగించేందుకు చొరవ తీసుకోండి

మీడియా అకాడమీ చైర్మన్‌కు వినతి



హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్ మ్యూచువల్లీ ఎయిడెడ్ హౌజింగ్ సొసైటీకి పేట్‌బషీరాబాద్‌లో కేటాయించిన 38 ఎకరాలను అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకునేలా చొరవ తీసుకోవాలని రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డికి సొసైటీ ప్రతినిధి బృందం విజ్ఞప్తి చేసింది. నూతనంగా ఎన్నికైన సొసైటీ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు రవికాంత్‌రెడ్డి, సీఈవో వంశీశ్రీనివాస్, డైరెక్టర్లు రమణరావు, అశోక్‌రెడ్డి బుధవారం శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. పేట్‌బషీరాబాద్ భూమి అప్పగింతకు సంబంధించి ఆయనకు వినతిపత్రం ఇచ్చారు. సంబంధిత జీవో కాపీలు, సుప్రీంకోర్టు ప్రతులను అందజేశారు. సొసైటీకి కేటాయించిన స్థలం మొత్తాన్ని సొసైటీకి స్వాధీనం చేయాలని కోరారు. తమ విజ్ఞప్తికి శ్రీనివాసరెడ్డి సానుకూలంగా స్పందించారని సొసైటీ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ తెలిపారు.

నాలాలపై సేఫ్టీ ఆడిట్

(5వ పేజీ తరువాయి)

టెండర్ నోటిఫికేషన్ ప్రకటించింది. ఖైరతాబాద్ జోన్‌లోని 250.70 కిలోమీటర్ల వరదనీటి ప్రవాహ వ్యవస్థపై సర్వే చేయనుండగా, ఇందులో 25.68 కి.మీల మేర మేజర్ నాలాలున్నాయి. వర్షాకాలం నేపథ్యంలో నగరంలోని నాలాలు, వరద నీటి కాలువల వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. చిన్నా, పెద్ద అన్న తేడా లేకుండా ప్రమాదవశాత్తు వాటిలో పడి ప్రాణాలు కోల్పోతున్నారు. పలు ప్రాంతాల్లో చెత్తా చెదారమూ నాలాల్లో వేస్తుండడంతో ప్రవాహ వ్యవస్థకు అవరోధంగా మారి పక్కనున్న కాలనీలు, బస్తీలు నీట మునుగుతున్నాయి. ఈ ఇబ్బందులకు చెక్ పెట్టేలా నాలాలు, వరద నీటి కాలువల సేఫ్టీ ఆడిట్ నిర్వహించనున్నారు. ఎంపికయ్యే ఏజెన్సీ సిబ్బంది ఆయా ప్రాంతాల్లో నడుచుకుంటూ తిరిగి క్షేత్రస్థాయి పరిస్థితులు పరిశీలించాల్సి ఉంటుంది. రక్షణా చర్యలున్నాయా, ఎక్కడైనా మనుషులు పడిపోయే ప్రమాదముందా, ప్రవాహం ఏ స్థాయిలో ఉంది, నాలాల పక్కన వీధి దీపాలున్నాయా..? ప్రమాదకర ఏరియాలను గుర్తిస్తూ, ఏ తరహా చర్యలు తీసుకోవాలనేది నివేదికలో సూచించాల్సి ఉంటుంది. కిలోమీటర్‌కు రూ.23,400ను అప్‌సెట్ ప్రైస్‌గా నిర్ణయించారు. 90 రోజుల్లో సర్వేకు సంబంధించి పూర్తిస్థాయి నివేదిక సమర్పించాల్సి ఉంటుంది.

మహాశివరాత్రికి 340 ప్రత్యేక బస్సులు

(5వ పేజీ తరువాయి)

ఈసీఐఎల్, కుషాయిగూడ, కీసర విలేజ్ పాయింట్స్ నుంచి కీసరగుట్టకు నడిపే స్పెషల్ ఆపరేషన్స్ ఇన్‌చార్జిగా కాచిగూడ డీఎం (9959226145), రాజేంద్రనగర్ (9959226147) డీఎంలను నియమించారు. రెజిమెంటల్ బజార్, సికింద్రాబాద్ స్టేషన్ నుంచి కీసరగుట్టకు నడిచే బస్సులకు కంటోన్మెంట్ డిపో మేనేజర్ (9959226143), అమ్ముగూడ, యాప్రాల్, వెంకటాపురం పాయింట్ల నుంచి కీసరగుట్టకు హకీంపేట డీఎం (9959226144), ఉప్పల్ ఎక్స్‌రోడ్ నుంచి కీసరగుట్టకు నడిపే బస్సులకు చంగిచర్ల డీఎం (7893088433) ఇన్‌చార్జీలుగా వ్యవహరిస్తారు.

కీసరగుట్టలో విచారణ కేంద్రం

గ్రేటర్‌తో పాటు పలుప్రాంతాల నుంచి కీసరగుట్టకు వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ కీసరగుట్టలో ఎంక్వైరీ కౌంటర్‌ను ఏర్పాటు చేస్తోంది. మూడు షిఫ్ట్‌ల్లో ప్రయాణికులకు బస్సుల వివరాలు తెలిపేందుకు సిబ్బందిని నియమించనుంది. ప్రత్యేక బస్సుల వివరాల కోసం కోఠి (9959226160), రేతిఫైల్ బస్‌స్టేషన్ (9959226154)లలోని కమ్యూనికేషన్ సెంటర్లలో సంప్రదించవచ్చని ఆర్టీసీ అధికారులు సూచిస్తున్నారు.

గాంధీలో ఎంసీహెచ్ భవనం సిద్ధం

(5వ పేజీ తరువాయి)

సమస్యలున్నవారు వస్తుంటారని తెలిపారు. గర్భిణులకు ఇతర సమస్యలు ఉత్పన్నమై అత్యవసర వైద్య సహాయం కోసం గాంధీ ప్రధాన భవనాలకు త్వరితగతిన తీసుకెళ్లేలా మాతాశిశు సంరక్షణ భవనానికి అనుసంధానంగా స్కైవాక్ వంతెనలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.



కంటోన్మెంట్ బోర్డు పారిశుధ్య మహిళా కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న జంపన్న విద్యావతి

మహిళలకు చీరల పంపిణీ

బోయిన్‌పల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవంను పురస్కరించుకొని కంటోన్మెంట్ బోర్డు బోయిన్‌పల్లి సర్కిల్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న మహిళా పారిశుధ్య కార్మికులకు కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యురాలు జంపన్న విద్యావతి ప్రతాప్ బుధవారం తన నివాసంలో చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యావతి మాట్లాడుతూ సహనానికి, ఓర్పుకు మారుపేరు మహిళలని అన్నారు. తల్లిగా, చెల్లిగా, భార్యగా ఇంటి బాధ్యతలను సమర్థవంతంగా నెరవేరుస్తూ వివిధ రంగాల్లో మహిళలు విశేషంగా రాణిస్తున్నారని విద్యావతి చెప్పారు. మహిళాదినోత్సవం రోజే కాకుండా నిత్యం మహిళలను గౌరవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు స్వరూప, పుష్పలత, నర్సమ్మ, తులసి పాల్గొన్నారు.

ఎంపీగా ఈటల రాజేందర్ గెలుపు ఖాయం

మౌలాలి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడిగా ఈటల రాజేందర్ గెలుపు ఖాయమని మల్కాజిగిరికి చెందిన సీనియర్ నాయకుడు బొనగిరి సురేష్‌యాదవ్ ధీమా వ్యక్తంచేశారు. బుధవారం శామీర్‌పేటలోని ఈటల నివాసంలో మల్కాజిరికి చెందిన పలువురు నాయకులతో కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాణిక్‌రెడ్డి, ప్రియతం రామకృష్ణ, వీరేశం యాదవ్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారిగా రమేష్



బౌద్ధనగర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా కమిటీ కోశాధికారిగా చిలకలగూడ మైలార్‌గడ్డకు చెందిన ఆకారం రమేష్ నియమితులయ్యారు. ఈమేరకు నియామక పత్రాన్ని ఓబీసీ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభసభ్యుడు డాక్టర్ లక్ష్మణ్, రమేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ బీజేపీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ గెలుపుకోసం కష్టపడి పనిచేస్తానని తెలియజేశారు. తనకు పదవి రావటానికి సహకరించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్‌గౌడ్, ప్రధానకార్యదర్శి మేకల సారంగపాణికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ముగింపులేని కథలు పుస్తకావిష్కరణ

చిలకలగూడ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రభాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీకళానికేతన్, హైదరాబాద్ సమర్పణలో నటుడు, కథ, నాటక రచయిత నెమలికంటి తారకరామారావు ముగింపులేని కథలు పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు గావించినట్లు రచయిత ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 7వ తేది గురువారం సాయంత్రం 6గంటలకి రవీంద్రభారతి, సమావేశ మందిరంలో నిర్వహించే కార్యక్రమంలో సభా ప్రారంభం జాగృతి విద్యా సంస్థల అధినేత డాక్టర్. ఒ.శ్రీనివాసరెడ్డి, సభాధ్యక్షత దూరదర్శన్ విశ్రాంత అధికారి ఓలేటి పార్వతీశం, ముఖ్య అతిథిగా విశ్రాంత ఉపకులపతి పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్, పుస్తక సమీక్ష నవ్య వారపత్రిక పూర్వ సంపాదకులు ఎ.ఎన్.జగన్నాధశర్మ, ఆత్మీయ అతిథిగా ఢిల్లీ విశ్వవిద్యాలయం, విశ్రాంత ఆచార్యులు రామవరపు గణేశ్వరరావు విచ్చేయనున్నట్లు సాహితీ ప్రియులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా నిర్వాహకులు కోరారు.

బీజేపీతోనే మహిళలకు ప్రయోజనం

బౌద్ధనగర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే మహిళలకు అన్నిరంగాల్లో లబ్ధి చేకూరుతుందని ఆపార్టీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్ గౌడ్, ప్రధానకార్యదర్శి మేకల సారంగపాణిలు అన్నారు. బుధవారం నామాలగుండు బీఎస్ఆర్ గార్డెన్‌లో సికింద్రాబాద్ కన్వీనర్ కందాడి నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన శక్తివందన్ మహిళా స్వయం సహాయక సంఘాలు, ఎన్జీఓల సంపర్క్ అభియాన్ మహిళల కార్యక్రమాన్ని ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రసంగాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ ప్రబారి రాంభూపాల్‌గౌడ్, ముఖ్యనాయకులు కనకట్ల హరి, రాచమల్ల కృష్ణమూర్తి, పోచయ్యయాదవ్, ప్రభుగుప్తా, ఎస్.మహేష్, ఎ.రమేష్, ప్రకాశ్‌గౌడ్, శారదామల్లేష్, మేకలకీర్తి, డివిజన్ అధ్యక్షులు అంబాల రాజేశ్వరరావు, రాజేశ్వరి, భానుమతి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జాయింట్ కన్వీనర్‌గా రాజేష్

చిలకలగూడ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మెట్టుగూడ బీజేపీ సీనియర్ నాయకుడు రాజేష్‌ని సికింద్రాబాద్ అసెంబ్లీ జాయింట్ కన్వీనర్‌గా నియమిస్తూ మహంకాళి, జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్ నియామక పత్రాలు అందజేసి శాలువాతో సత్కరించి, పార్టీ పటిష్ఠతకి కృషి చేయాలని, రానున్న ఎన్నికల్లో పార్టీ ఘన విజయానికి కృషి చేయాలని సూచించారు. తనకిచ్చిన బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తానని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్ గౌడ్‌కి రాజేష్ ధన్యవాదాలు తెలిపారు.



చలివేంద్రాల ఏర్పాటు

సామాజిక సేవలో భాగంగా పాదచారుల దాహార్తిని తీర్చేందుకు సోషల్ వర్కర్ పి.మధుబాబు తన స్వంత ఖర్చులతో బుధవారం తార్నాక, శాంతినగర్ చౌరాస్తాలో ఉచిత చలివేంద్ర కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొ. మోహన్‌రావు, కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి, అరుణ్ కుమార్, విజయ్‌కుమార్, రాము, హరి, శ్రీరాం, శివకుమార్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

- తార్నాక, ఆంధ్రజ్యోతి

రాష్ట్రపతి నిలయంలో చేనేత హస్త కళల ప్రదర్శన

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో గవర్నర్ తమిళిసై సౌందర రాజన్, పొన్నం ప్రభాకర్‌తో కలిసి ప్రారంభించారు. రాష్ట్రపతి నిలయాన్ని అభివృద్ధి చేయడానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కృషి చేస్తున్నారని అన్నారు. రాష్ట్రపతి నిలయం అందాలను తిలకించడానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పౌరులు వస్తున్నారని పేర్కొన్నారు.



చేనేత హస్తకళల ప్రదర్శనను ప్రారంభిస్తున్న గవర్నర్ తమిళిసై సౌందర రాజన్

తిరుమలగిరి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి నిలయం వారాంతాల్లో కూడా సందర్శకులు వీక్షించడానికి సాయంత్రం ఐదు నుంచి ఏడు గంటల వరకు సమయాన్ని పొడిగించామని తెలిపారు. రాష్ట్రపతి నిలయంను ఇన్‌స్టాగ్రామ్‌లో కూడా వీక్షించడానికి పొందుపరిచాం అన్నారు. చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఆమె తిలకించారు. సుమారు ముప్పై స్టాల్స్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈనెల 10వ తేది వరకు ఉదయం 10 నుండి సాయంత్రం 6గంటల వరకు తెరిచి ఉంటుందని చెప్పారు.

కొత్త విజిటర్ ఫెసిలిటేషన్ సెంటర్ ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మార్గదర్శకత్వంలో ప్రారంభం చేశారు. పచ్చని తోటలతో మంత్ర ముగ్ధులను జోడిస్తూ పూర్తిగా పనిచేసే పూల గడియాన్ని ఆవిష్కరించారు.

గడియాం దాని శాశ్వతమైన మొక్కలతో సందర్శకులను మంత్రముగ్ధులను చేస్తుంది. అదేవిధంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రపతి నిలయాన్ని సందర్శకుల కేంద్రీకృత గమ్యస్థానంగా మార్చడంలో నిలయం అధికారి సిబ్బంది చూపిన చొరవను ప్రశంసించారు. నిలయం విస్తరణను పెంపొందించడానికి మద్దతు తెలియజేస్తానని అన్నారు. నిలయం వద్ద ఉన్న గొప్ప వారసత్వాన్ని అన్వేషించాలని, ఎక్కువ మంది ప్రజలు సందర్శించాలని కోరారు. నిలయం బహిరంగంగా ప్రారంభించి ఒక సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా యాన్యువల్ క్రానికల్స్ ఆఫ్ రాష్ట్రపతి నిలయం 'ఏ ఇయర్ విత్ ప్రెసిడెంట్ శ్రీమతి ద్రౌపది ముర్ము' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. రాష్ట్రపతి నిలయం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుందని తెలిపారు. తెలంగాణ చేనేత టెక్స్‌టైల్స్ డైరెక్టర్ డాక్టర్ అలుగు వర్షిణి, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తదితరులు పాల్గొన్నారని రాష్ట్రపతి నిలయం రజనీప్రియ తెలిపారు.

మహా శివరాత్రికి భారీ ఏర్పాట్లు

మారేడ్‌పల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లోని శ్రీ పహాడీ సాయిబాబా సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేస్తున్నారు. ప్రశాంతతను ఆస్వాదించే విశాలమైన గుట్టప్రాంతంలో 25 ఫీట్ల ఎత్తుగల మహాశివుడిని ఏర్పాటు చేశారు. ఇక్కడి ప్రత్యేకతను గుర్తించిన భక్తులు మహాశివుడిని దర్శించుకోవడానికి ప్రతి ఏటా గ్రేటర్ నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు కుటుంబ సమేతంగా వచ్చి శివలింగానికి అభిషేకం చేసి పూజలు చేస్తారు. అనంతరం ట్రస్ట్ నిర్వాహకులు అందజేసే పండ్లు పానీయాలు (అల్పాహారం) తీసుకుంటారు. ఈనెల 8వ తేదీన మహాశివరాత్రి వేడుకలను పురస్కరించుకొని ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు వివిధ శివ భక్తి గీతాలు, భజనలు, వివిధ కార్యక్రమాలతో ఉత్సవాలను వైభవంగా ప్రతి ఏటా మాదిరిగానే ఈసారి మరింత గొప్పగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు ఆయా ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో రానున్నట్లు తెలిపారు.



మహాశివరాత్రిని పురస్కరించుకొని మహేంద్ర హిల్స్‌లోని ఓ గుట్టపై ఏరాటు చేసిన 25 ఫీట్ల ఎత్తుగల భారీ ఆకారం కలిగిన మహాశివుడు



మంత్రి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేస్తున్న లష్కర్ జిల్లా సాధనసమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ తదితరులు

సికింద్రాబాద్ జిల్లాను ఏర్పాటు చేయాలి

- లష్కర్ సాధనసమితి సభ్యులు

బౌద్ధనగర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక సికింద్రాబాద్ జిల్లాను చేయాలని లష్కర్ సాధన సమితి సభ్యులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. లష్కర్ (సికింద్రాబాద్ జిల్లా)ను చేయాలని కోరుతూ లష్కర్ సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రధానకార్యదర్శి సాదం బాలరాజు యాదవ్, ఉపాధ్యక్షుడు శైలేందర్, సభ్యులు సునీల్‌ముదిరాజ్, జగదీష్‌గౌడ్, అజీజ్, అశోక్, రవీంద్రసాగర్ తదితరులు బుధవారం రాష్ట్ర రెవిన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు.



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న ఆర్యసమాజం సభ్యులు

ముగిసిన మహర్షి దయానంద సరస్వతి జయంతి వేడుకలు

బౌద్ధనగర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి ఆర్యసమాజంలో గత రెండురోజులుగా జరుగుతున్న మహర్షి దయానంద సరస్వతి ద్విశత (రెండువందల) జయంతి వేడుకలు బుధవారంతో ముగిశాయి. ఆర్యసమాజం అధ్యక్షుడు డి.గంగాధర్ అధ్యక్షతన జరిగిన వేడుకల్లో విశ్రాంత తెలుగు శాఖాధిపతి డాక్టర్ మసన చెన్నప్ప ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. దయానందుడి విశిష్టసేవలను కొనియాడారు. ఆర్యసమాజం ఒకమతం కాదని, ఆది శ్రేష్ఠ పురుషుల సమూహమని, విశ్వజనులను ఆర్యులుగా చేయటమే ఉద్దేశ్యమన్నారు. వైదిక సాహిత్య పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు వారు బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు రావికంటి కృష్ణమూర్తి, సభ్యులు డి.నర్సయ్య, యూ.యాదగిరి, ఉప్పల కిషోర్‌బాబు పాల్గొన్నారు.

8న ధర్మధ్వజం ప్రతిష్ఠాపన మహోత్సవం

మారేడ్‌పల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 8న ఉదయం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పికెట్‌లోని శ్రీపంచభూత భువనేశ్వర స్వామి ఆలయం గోపురంపై 18 ఫీట్ల ఎత్తు గల ధర్మధ్వజం ప్రతిష్ఠాపన మహోత్సవానికి పీఠాధిపతులు, వేద పండితుల మంత్రోత్సవాల నడుమ ఘనంగా ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ప్రతినిధి జెట్టి ఉమేశ్వరరావు తెలిపారు. పికెట్‌లో ప్రసిద్ధిగాంచిన శ్రీ పంచభూత భూమేశ్వర స్వామి ఆలయాన్ని ఒకే రాతి శిలతో 33 ఫీట్ల ఎత్తుతో నిర్మించారు. ధర్మధ్వజ ప్రతిష్ఠాపన ఏర్పాటుతో మరింత ప్రతిష్ఠాత్మకమైన ఆలయంగా రూపుదిద్దుకుంటుందని పేర్కొన్నారు.

ఈ ఆలయంలో శివరాత్రి సందర్భంగా ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సాంప్రదాయ దుస్తులతో వచ్చి కుటుంబ సమేతంగా శివలింగానికి అభిషేకం చేసుకునే వీలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అదే రోజు ఆలయ ఆవరణలో శివ భక్తి గేయాలు, భజనలు వంటి కార్యక్రమాలతో పాటు ఉపవాస దీక్షలు చేసుకునే భక్తులు శ్రీ పంచభూత భూమేశ్వర స్వామి వారిని దర్శించుకున్నట్లు తెలిపారు. ధర్మధ్వజ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కంటోన్మెంట్ బోర్డ్ సీఈఓ మధుకర్ నాయక్ దంపతులు విచ్చేయనున్నట్లు తెలిపారు.

మోండా మార్కెట్‌లో జీహెచ్ఎంసీ కమిషనర్ పర్యటన

రెజిమెంటల్‌బజార్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ మోండా మార్కెట్ డివిజన్‌లో వివిధ ప్రాంతాల్లో బుధవారం ఉదయం జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్, జోనల్ కమిషనర్ రవికిరణ్, డిప్యూటీ కమిషనర్ సమ్మయ్యతో పాటు వివిధశాఖల అధికారులతో కలిసి పర్యటించారు. ఆల్ఫా హోటల్ నుంచి సుభాష్‌రోడ్డులో ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన ఆక్రమణలను తొలగించాలని కమిషనర్ సూచించారు. వ్యాపారులు కేవలం ఫుట్‌పాత్‌పై మూడు అడుగుల మేరకు మాత్రమే వ్యాపారాలు నిర్వహించుకునేలా చూడాలన్నారు. అశోక్‌నగర్ కమ్యూనిటీహాల్‌ను సెక్యూరిటీ సిబ్బంది ఆక్రమించటం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే ప్రజలకు ఉపయోగపడేలా చూడాలని ఆదేశించారు. టకరాబస్తీలో బంగారు దుకాణాలకు చెందిన చెత్తను రోడ్డుపక్కన వేయటంతో వారికి యాభైవేల జరిమానా విధించారు. రెజిమెంటల్‌బజార్‌లో లాడ్జీలకు పార్కింగ్ లేక రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారని, ఫైర్ సేఫ్టీ పాటించటంలేదని, కెమెరాలు కూడా ఏర్పాటుచేసుకోవటం లేదని కార్పొరేటర్ కొంతం దీపిక కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. అలాంటి లాడ్జీలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కమిషనర్, అధికారులను ఆదేశించారు. 31వ బస్టాప్ నుంచి నాలాబజార్ వెళ్లే సీసీ రోడ్డుపై ఆవులను కట్టివేస్తున్నారని కార్పొరేటర్ ఫిర్యాదు చేయటంతో వాటిని గోశాలకు తీసుకుని వెళ్లాలని రోడ్డుపై వేసే వ్యర్థాలను ప్రత్యేక వాహనంలో ఇందిరాపార్క్‌లోని నర్సరీకి తరలించాలని సూచించారు. 31వ బస్టాప్ వద్ద శివవైన్స్ ప్రాంతంలో ఉన్న బహిరంగ మూత్రశాలలను తొలగించి గ్రీనరీని ఏర్పాటుచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈ సుదర్శన్, ఏఈ రవీందర్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ కిష్టఫర్ తదితరులు పాల్గొన్నారు.



జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్‌తో మాట్లాడుతున్న కార్పొరేటర్ కొంతం దీపిక

భారీ వాహనాలపై కేసు నమోదు

తిరుమలగిరి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నియమ నిబంధనలు ఉల్లంఘిస్తున్న భారీ వాహనాలపై తిరుమలగిరి ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ మధుబాబు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం నిషేధాజ్ఞలు ఉల్లంఘించి హైదరాబాద్ సిటీలోకి ఎంట్రీ ఇచ్చిన నాలుగు భారీ వాహనాలను పట్టుకుని బొల్లారం పోలీస్ స్టేషన్‌కి తరలించి ఇట్టి వాహనదారులపై చట్టపరమైన కేసులు నమెదు చేయడమైనది. నిషేధాజ్ఞలు ఉల్లంఘించి హైదరాబాద్‌లోకి వచ్చినట్లైతే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మధుబాబు తెలిపారు. భారీ వాహనాలు కేవలం రాత్రి 11 నుంచి ఉదయం 7గంటల వరకు మాత్రమే అనుమతి కలదన్నారు.

దోబీఘాట్ స్థలాన్ని తిరిగి రజకులకు అప్పగించాలి

మల్కాజిగిరి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : గౌతంనగర్ డివిజన్ పరిధిలోని జ్యోతినగర్‌లో గల దోబీఘాట్‌ను తిరిగి రజకులకే అప్పగించాలని కోరుతూ అఖిలపక్షం ఆధ్వర్యంలో బుధవారం జీహెచ్ఎంసీ డీసీని కలిసి వినతిపత్రం సమర్పించారు. గతంలో జ్యోతినగర్‌లో రజకులకు బట్టలు ఉతికేందుకు గాను దోబీఘాట్ ఉండేదని, అయితే ఆ దోబీఘాట్‌ను కొంతకాలం క్రితం బాగుచేసి దాని స్థలంలో పార్కు ఏర్పాటు చేశారని అన్నారు.

ఇప్పుడు అది పార్కు స్థలంగా మారిపోగా కనీసం దోబీవారిని పార్కులోకి సైతం అనుమతించడం లేదని, మా స్థలాన్ని మాకు అప్పగించాలని రజకసంఘం నాయకులు పలువురు అఖిలపక్షం ఆధ్వర్యంలో డీసీని కలిసి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో రజకసంఘం కార్యదర్శి నాగరాజు, సిపిఐ నాయకులు కృష్ణమూర్తి, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, వెంకటేష్‌యాదవ్, టీడీపీ నాయకులు చంద్రశేఖర్, గోపి, బీజేపీ నాయకులు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



కీసరగుట్ట బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం శర్మ

ప్రారంభమైన కీసరగుట్ట బ్రహ్మోత్సవాలు

- నేడు స్వామివారి కల్యాణమహోత్సవం

కీసర, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఆరు రోజుల పాటు జరిగే కీసరగుట్ట మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం శర్మ, ఈవో నరేందర్ ఆధ్వర్యంలో వేద పాఠశాల పండితుడు గణపతిశర్మచే గణపతి పూజతో బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. మొదటిరోజు పూజల్లో భాగంగా ఉదయం గర్భాలయంలోని మూలవిరాట్‌కు శ్రీ మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. రాత్రి స్వామివారి ఉత్సవ మూర్తులను కీసరలోని వంశపారంపర్యంగా వస్తున్న నివాస గృహంలోకి తీసుకెళ్లారు.

బ్రహ్మోత్సవాల్లో రెండోరోజు స్వామివార్ల ఉత్సవమూర్తులను పల్లకీసేవ ద్వారా కీసర గ్రామం నుంచి నడకదారి గుండా కీసరగుట్టకు తీసుకువస్తారు. శ్రవణ నక్షత్రయుక్త లగ్నంలో శ్రీ భవానీ శివదుర్గ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామివార్ల కల్యాణమహోత్సవం నిర్వహిస్తారు.

కోటి రూపాయలు కేటాయింపు

బ్రహ్మోత్సవాలకు ప్రభుత్వం కోటి రూపాయలు ప్రత్యేక నిధులు కేటాయిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు భక్తుల సౌకర్యార్థం ఎలాంటి అవసరం ఉన్నా ఆలయ నిర్వహకులు, జిల్లా కలెక్టర్ సమన్వయం చేసుకొని నిధులు వినియోగించుకోవడం జరుగుతుంది.

- ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం, రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం అన్నదాన సత్రాలను ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ప్రారంభించారు.



టీడబ్ల్యూజేఎఫ్ డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి ఉత్తమ్, ఫెడరేషన్ ప్రతినిధులు

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారానికి కృషి

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నల్లకుంట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చే విషయంలో తాను శాయశక్తులా కృషి చేస్తానని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం నగరంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) డైరీ-2024ని మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల విషయమై తాను చొరవ తీసుకుని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య, ఉపాధ్యక్షులు పులిపలుపుల ఆనందం, పిల్లి రాంచందర్, కార్యదర్శులు సలీమా, గుడిగ రఘు, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌యూజే డైరీ ఆవిష్కరణ




హెచ్‌యూజే డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌యూజే ప్రతినిధులు

హైదరాబాద్ సిటీ, మార్చి 6 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్రంలో అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇళ్లు లేదా ఇళ్ల స్థలాలు ఇస్తామని సమాచార, రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. త్వరలో అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం కాంగ్రెస్ ప్రభుత్వం చూపిస్తుందన్నారు. హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యూజే-టీడబ్ల్యూజేఎఫ్) డైరీని బుధవారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్‌యూజే అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్‌కుమార్, బి.జగదీశ్వర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గండ్ర నవీన్, ట్రెజరర్ రాజశేఖర్, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు చంద్రశేఖర్, రాధిక, రాష్ట్ర నాయకులు రామకృష్ణ, హెచ్‌యూజే ఉపాధ్యక్షులు బి.దామోదర్, నాగవాణి, రమేష్, వీరేష్, విజయ, ప్రశాంత్ పాల్గొన్నారు.

గాంధీలో ఎనిమిదేళ్ల చిన్నారికి అరుదైన శస్త్ర చికిత్స

అడ్డగుట్ట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గాంధీ ఆస్పత్రి చరిత్రలో ఎనిమిదేళ్ల చిన్నారికి అరుదైన శస్త్ర చికిత్సను చిన్నపిల్లల వైద్యుల బృందం విజయవంతంగా చేసింది. చిన్నపిల్లల విభాగం హెచ్ఓడీ ప్రొఫెసర్ నాగార్జున తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా భైరాంగూడకు చెందిన మైథిలీ(8) కొంతకాలంగా దగ్గు, తీవ్ర జ్వరంతో బాధపడుతుండగా తల్లిదండ్రులు అనేక ఆస్పత్రుల్లో వైద్యం చేయించారు. తగ్గకపోవడంతో ఈనెల 1న గాంధీ ఆస్పత్రిలోని చిన్నపిల్లల విభాగంలో చేర్పించారు. వైద్యులు చిన్నారికి ఎంఆర్ఐ టెస్టులతో పాటు వైద్య పరీక్షలు చేయించారు. చివరికి ఎమ్మారైలో బ్రాంకో జెనిక్ సిస్ట్ వ్యాధి ఉన్నట్లు వైద్యులు నిర్ధారణకు వచ్చారు. కేసు సవాల్‌గా తీసుకున్న గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావుతో పాటు గాంధీ చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ ఎస్.శ్రీనివాస్, మనోజ్, అశ్రిత్‌రెడ్డి, హర్ష, నాగార్జునతో కూడిన వైద్య బృందం శస్త్ర చికిత్స చేసి చిన్నారికి ఉపశమనం కల్పించారు.



ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న డీజీపీ రవిగుప్తా

18 నుంచి అఖిల భారత పోలీస్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ : డీజీపీ రవిగుప్తా

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ 16వ అఖిల భారత పోలీస్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఆతిథ్యమిస్తోందని డీజీపీ రవిగుప్తా తెలిపారు. హైదరాబాద్‌లోని పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఈ నెల 18 నుంచి 21 వరకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఛాంపియన్‌షిప్ పోటీల నిర్వహణ ఏర్పాట్లకు సంబంధించి తన కార్యాలయంలో సీనియర్ అధికారులతో కలిసి డీజీపీ రవిగుప్తా బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 14 రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి మొత్తం 440 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. మొత్తం 24 జట్లు పోటీ పడతాయని, నాలుగు రోజులపాటు జరిగే ఈ పోటీల్లో సుమారు 745 మ్యాచ్‌లు జరుగుతాయని డీజీపీ వెల్లడించారు. అదనపు డీజీపీలు అభిలాషా బిస్త్, సంజయ్ కుమార్ జైన్, విజయ్ కుమార్, విక్రమ్ సింగ్ మాన్, స్టీఫెన్ రవీంద్ర, సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, ఐజీ ఎం. రమేష్ ఇతర కీలక అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.